

# ఎన్నారై ముచ్చట్లు

-సత్యం మందపాటి



## (గతసంచిక తరువాయి)

## 7. నవ్వితే నవ్వండి!

**'నవ్వు నాలుగందాల చేటు'** అని మనకో సామెత వుంది.

'ఆ అమ్మాయిని చూడు. వయసొచ్చిన ఆడపిల్ల బయట ఇంతమందిలో సిగ్గు లేకుండా ఎలా నవ్వుతున్నదో!' అంటాడొక సంప్రదాయవాది.

'వీడికి పెద్దవాళ్ళంటే అసలు గౌరవం లేదు. మనం ఏదైనా చెబుతుంటే పళ్ళికిలిస్తూ మన కళ్ళల్లోకే చూస్తుంటాడు' అంటాడు ఒకాయన.

'సిరిమల్లె పువ్వల్లె నవ్వు' అంటూ మన అభిమాన జానకమ్మగారి చేత పాట పూర్తయేదాకా కిలకిలానే కాకుండా గలగలా కూడా నవ్విస్తారు బాలు.

ఆయనే మళ్ళీ, 'నవ్వుతూ బ్రతకాలిరా, తమ్ముడూ' అని శ్రావ్యంగా పాడుతారు.

జంధ్యాలగారు మాత్రం, 'నవ్వించటం ఒక యోగం, నవ్వటం ఒక భోగం, నవ్వకపోవటం ఒక రోగం' అంటారు.

మరి తెలుగువారి హాస్యబ్రహ్మలు బాపు, రమణలు ఏమంటారు?

ఏమంటారా, 'నవ్వితే నవ్వండి, మాకభ్యంతరం లేదు!" అంటారు రమణగారు నవ్వుతూనూ, బాపుగారు నవ్వకుండానూ.

దుర్యోధనుడి అవస్థ చూసి పెద్దగా నవ్వి, మహాభారతంలో కురుక్షేత్రానికి కారణం అయింది ద్రౌపది.

నవ్వుతూనే కౌరవ వినాశనం చేశాడు శ్రీకృష్ణుడు.

ఎన్నో దేశాలు ముందుకు వెడుతుంటే భారతదేశం వెనకపడిపోతున్నదని నవ్వులపాలవకుండా, ప్రధానమంత్రి అయాక అస్సలు నవ్వకుండానే పి.వి.నరసింహారావుగారు భారతదేశాన్ని ఐదేళ్ళలో ప్రపంచ ఆర్థిక, సాంకేతిక రంగాల్లో మొదటి బెంచీలో కూర్చోబెట్టారు.

మన నిత్య జీవితంలో రకరకాల కారణాలతో రకరకాల నవ్వులు చూస్తుంటాము.

కొన్ని హాస్యం కోసమయితే, కొన్ని అపహాస్యం కోసం. కొన్ని నవ్వులకు హాస్యంతో సంబంధమే వుండదు.

కొన్ని దేశాల్లో నవ్వు అనేది వ్యాపార లక్షణాలలో ముఖ్యమైనది. కొన్ని దేశాల్లో అదొక వ్యాపార లక్షణం కానే కాదు. కొన్ని సంస్కృతుల్లో అది ఎంతో ముఖ్యమైనది, కొన్ని సహజంగా కనిపిస్తుంది. కొన్నిటిలో కాదు.

అందుకే ఈసారి మనం అంతర్జాలంలో అంతర్జాతీయ నవ్వులెలా వుంటాయో చూద్దాం.

నాకు విషయపరంగా కల్చరల్ ఆంథ్రొపాలజీ అంటే ఎంతో ఇష్టం. కల్చరల్ ఆంథ్రొపాలజీ అంటే ఏమిటి మాస్టారూ అని కొంతమందైనా అడుగుతారని నాకు తెలుసు. కల్చరల్ ఆంథ్రొపాలజీ అంటే సాంస్కృతిక మానవ శాస్త్రం.

రకరకాల సంస్కృతులవారి వేషభాషలూ, రంగు రూపే కాకుండా, వారి నమ్మకాలూ, అపనమ్మకాలూ, ఇష్టాలూ, అయిష్టాలూ, ఆచారాలూ, వ్యవహారాలు, రోజువారీ జీవితంలో వారి ప్రవర్తనలూ, సంభాషణ విధానాలూ మొదలైనవెన్నో తెలుసుకోవటం అంటే నాకు వల్లమాలిన ఇష్టం. అదే నేను ఎంతో ఇష్టంగా పరిశీలించే సాంస్కృతిక మానవ శాస్త్రం.

ఎన్నో పుస్తకాలు చదివి అర్థం అయినవీ, అర్థం కానీవీ అన్నీ జీర్ణించుకున్నాను. ఇంకా చదువుతూనే వున్నాను. వాటి గురించి వ్రాస్తూనే వున్నాను. ఇక్కడ అమెరికాలో ఎన్నో దేశాల స్నేహితుల మధ్య ఆ వైవిధ్యంలో జీవిస్తూ వుండటం ఒక పెద్ద అదృష్టం. అంతేకాక ఒక పెద్ద కంపెనీలో గ్లోబల్ సప్లై చైన్ మానేజరుగా కొన్ని సంవత్సరాల తరబడి ఆఫీసు పని మీద ప్రపంచంలో ఎన్నో దేశాలకు వెళ్ళటం వల్లా, సమయం దొరికినప్పుడల్లా ఎన్నో విదేశీ విహారయాత్రలు చేయటం వల్లా అక్కడ నేను చూసిన వారి సంస్కృతులలో పైన చెప్పిన ఎన్నో వైవిధ్యభరితమైన సంస్కృతులు, వారి ప్రవర్తనలు, కథలూ, కమామిషులూ నా విశ్లేషణకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

ఈ వ్యాసంలో అంతర్జాతీయంగా ఈ నవ్వుల జల్లుల మీద నా పరిశీలన ఎలా వుందో చూద్దాము.

అమెరికా, కెనడావంటి అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో కాపిటలిజం నవ్వుతూ నిలబడటానికి కారణాలలో ఒకటి ఆ చిరునవ్వులేనని నా ఉద్దేశ్యం.

ఎవరైనా అమెరికాలో అడుగుపెట్టినప్పటినించీ చూసేవి ఈ చిరునవ్వులే. ఎయిర్‌పోర్ట్ కౌంటర్ దగ్గరకు వెళ్ళగానే 'వాట్ కెన్ ఐ డు ఫర్ యు?' అని నవ్వుతూ పలకరిస్తుంది అక్కడి క్లర్క్. విమానం ఎక్కగానే మళ్ళీ ఆ చిరునవ్వులే. హోటలుకి వెళ్ళినా, రెస్టారంటుకి వెళ్ళినా, ఆసుపత్రికి వెళ్ళినా, షాపులకి వెళ్ళినా ఆ చిరునవ్వులే.

"మీకు కావలసిన సామాన్లు అన్నీ దొరికాయా?" అని అడుగుతుంది చిరునవ్వు కురిపిస్తూ ఒక అమ్మాయి.

షాపులోనించీ వెడుతుంటే. 'హేవ్ ఎ నైస్ డే' అంటుందింకో ఆవిడ ఇంకో చిరునవ్వు కురిపిస్తూ.

అలాగే ప్రొద్దున్నే ఇంటి దగ్గర నడుస్తుంటే, మనమెవరమో తెలియకపోయినా చాలమంది నవ్వుతూ "గుడ్ మార్నింగ్" అని పలకరిస్తారు.

నేనూ మా సేల్సుగారూ కష్టమర్ దగ్గరికి వెళ్ళినప్పుడు, నేను అస్సలు నవ్వకుండా ఇంజనీరింగ్ ప్రెజంటేషన్ చేశాక, మా మైక్ సేల్స్ తను నవ్వుతూ, కష్టమర్లు కష్టపడకుండా ఇష్టపడేటట్లు మధ్యే మధ్యే హాస్యం సమర్పించి వాళ్ళ దగ్గర పెద్ద ఆర్డరే సంపాదిస్తాడు.

ఇంకొక విషయం. పశ్చిమ దేశాల్లో కొన్ని ముఖ్యమైన వ్యాపార నిర్ణయాలు జరిగేవి బార్లలో నవ్వులు ముంచిన బీర్లతోనూ, వారాంతం నవ్వులతో గాల్ఫ్ ఆడాలిరా అమ్మడూ అంటూను. ఇలాటి హాసాలూ, మంద(పాటి)హాస్యాలూ ఎన్నడూ వృధా పోవు మరి.

మనమేదయినా ఉద్యోగానికి అప్లికేషన్ పెడితే (లేదా రెస్యూమే పంపిస్తే), వాళ్ళకి మనకి ఉద్యోగం ఇవ్వటం ఇష్టం లేకపోతే, ఒక ఫోన్ కాలో, ఉత్తరం ద్వారానో అది చెప్పటం కూడా మర్యాదగా వుంటుంది. 'అయ్యా/అమ్మా! మీరు పంపించిన రెస్యూమే అందింది. చూడటానికి చాల అందంగా వున్నది. మాకెంతో నచ్చింది. మీ చదువూ, చట్టుబండలూ కూడా ఆకర్షణీయంగా వున్నాయి. కానీ మీకన్నా మాకు బాగా నచ్చిన ఇంకొక ఆమె దొరికినందున, మీకీ ఉద్యోగం ఇచ్చి మా కంపెనీలో మీచేత పని చేయించుకునే అదృష్టం మాకు దక్కలేదు. సరే! ఈసారికి ఇలాగే కానిద్దాము. రాబోయే అవకాశాల్లో మీకు సరిపడేవి వుంటే తప్పకుండా మళ్ళీ కలుద్దాము. అప్పటిదాకా మీ ఉద్యోగ ప్రయత్నాలు ఫలించాలని ఆశిస్తున్నాము' అని వ్రాసి మనల్ని సంతోషపెడతారు.

'మాకు కావలసిన చదువూ సంధ్యా మీకు లేవు కనుక మీరు పనికిరారు' అని నిర్మొహమాటంగా అనకుండా ఇలా చెప్పటం వల్ల కొన్ని లాభాలూ వున్నాయి. నేను హాస్యం కోసం కొంచెం సాగదీశానుగానీ, దాంట్లో అలా నొప్పించని భాషలో, చిన్నబుచ్చని పద్ధతిలో చెప్పటం వల్ల, నిరుద్యోగంలో వున్నవాళ్ళకి తాము ఇక దేనికీ పనికిరాము అనే భావన మనసులోకి రాకుండా వుంటుంది. అదీకాక ఆ కంపెనీ భవిష్యత్తులో మనకి ఉద్యోగం ఇవ్వాలనుకుంటే ఆ వాతావరణం చక్కగా స్నేహపూరితంగా వుంటుంది. 'నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ' అనే సూత్రం అమెరికా వాళ్ళకి కూడా తెలిసిపోయిందేమో మరి!

అంతేకాదు. కంపెనీల్లో ఉద్యోగంనించీ ఉద్వాసన చెప్పేటప్పుడు కూడా బాసుగాడు ఎంతో వినయంగా సన్నపాటి నవ్వు నవ్వుతూ, "నీ అంతటి గొప్ప ఇంజనీరు ఈ భూప్రపంచంలో ఎక్కడ వెతికినా కనపడడు. కాకపోతే చైనావాడు మనకి లాభాలు రాకుండా శాపం పెట్టాడు. అందుకని నిన్ను సాగనంపాల్సి వచ్చింది. మళ్ళీ ఇంకోజన్మలో నేనే మేనేజర్నై, నిన్నే మా కంపెనీలో సీనియర్ ఇంజనీరుగా తీసుకుంటాను. నిన్ను మాత్రం వదులుకోలేను" అంటూ సందర్భోచితంగా వుండదేమోనని తన చిరునవ్వుని చలికాలంలో మిషిగన్‌లో పడే తెల్లటి మంచులా మన మీద కురిపిస్తాడు.

ముళ్ళపూడి వెంకటరమణగారు చెప్పినట్టు 'నవ్వొస్తే ఎవడైనా నవ్వుతాడు. ఏడుపొచ్చినప్పుడు నవ్వేవాడే హీరో' అనుకుంటూ మన హీరో ఒక అరనవ్వు నవ్వి, తట్టాబుట్టా సర్దుకుని గుట్టుచప్పుడు కాకుండా దొడ్డి దారిన ఇంటికి వెడతాడు.

చాలమంది అమెరికాలో ఇంటావిడలకు ఒక సరదా వుంది. అదేమిటంటే ఇవాళ షాపులో బట్టలో, బుట్టలో, కొత్తిమీర కట్టలో కొనటం, అంటే సమయం దొరికినప్పుడు షాపింగ్ చేయటం అన్నమాట. ఇంటాయన ఎలాగూ ఫుట్‌బాల్ ఆట చూస్తున్నాడు కదా అని, నిన్న కొన్నది అదే షాపుకి మళ్ళీ రేపే వెళ్ళి తిరిగి ఇచ్చేయటం. షాపులో ఆ అమ్మాయి ఎందుకు తిరిగి ఇస్తున్నారు అని కూడా ప్రశ్నించకుండా, ఒక చిరుహాసంతో తడిపిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తుంటే హాయిహాయిలే సఖ అనిపిస్తుంది.

క్రిస్మస్ పండగకు ఆఫీసుల్లో ఇతర ఉద్యోగులతో కానుకలు పంచుకోవటం అమెరికాలో ఒక ఆచారం. ఒక్కొక్కరు పది డాలర్లు మించకుండా కానుకలు తెచ్చి వాటి మీద ఒకటి, రెండు, మూడు... అంటూ నెంబర్లు వేస్తారు. అలాగే అవే నెంబర్లు వేసిన కాగితాలు ఇంకొక కప్పులోనించీ ఒక్కొక్కరూ తీసుకుని, ఎవరికి ఏ నెంబరు వస్తే ఆ కానుక తీసుకుంటారన్నమాట. మనం ఇచ్చిన కానుక వాళ్ళకి నచ్చకపోయినా, ముఖం నిండా నవ్వులు పులుముకొని, 'అబ్బ! ఇలాటి దాని కోసం ఎన్నాళ్ళనించో వెతుకుతున్నాను. ఇవాళ్టికి దొరికింది. ఎంత బాగుందో. థాంక్యు!" అంటుంది మా సెక్రటరీ థెరసా. మన అదృష్టం బాగుంటే నుదుటి మీదో, బుగ్గ మీదో ఒక ముద్దు పెట్టేస్తుంది కూడాను. ఇది అమెరికాలో నేను ఎప్పుడూ చూసే ఒక కనీస మర్యాద. ఆ తర్వాత ఇంటికి వెళ్ళే లోపలే 'ఇదేదో డాలర్ షాపులో కొన్నట్టున్నాడు ఈ చీపోగాడు' అనుకుంటూ మనమిచ్చిన దాన్ని పారేసిననా పారేయవచ్చు. అంతేగానీ, మా అనకాపల్లి అప్పారావులా 'ఇదేమిటండీ, ఇంత చెత్తది పట్టుకొచ్చారు' అని ముఖం మీదే అనదు.

అమెరికాలో ఒకసారి పరిచయం అయిన వాళ్ళని మరచిపోవటం అన్నది తక్కువే. ఎప్పుడో, ఎక్కడో, ఏదో అవసరానికి ఉపయోగించుకోవటం అమెరికా నిత్యజీవితంలో ఎప్పుడూ చూస్తూనే వుంటాం. అలా చేయాటానికి మంచి మందు ఈ మందహాసాలే, ఈ చిరునవ్వులే అని నా డౌటనుమానం.

నేనిక్కడ ఒక కన్సల్టింగ్ కంపెనీ పెట్టాలన్నా, వేరే కంపెనీలో ఉద్యోగం సంపాదించాలన్నా ఈ పరిచయాలవల్లనే, ఈ నెట్వర్క్ వల్లనే సులభమవుతుంది. దీనికి అయే ఖర్చు ఒక్క చిరునవ్వు. ఇంకొక్క చిరునవ్వు. అంతే.

ఇక ఇంగ్లండ్‌లో అయితే, వాళ్ళు కూడా చిరునవ్వులు చిందిస్తారు కానీ ఆ చిందిన చిరునవ్వులు నేల మీద పడకముందే, మా ఆస్టిన్‌లో పడే మంచు తునకల్లా క్రిందపడే లోపలే కరిగిపోతాయి. కళ్ళముందే మాయమవుతాయి. అంటే వారి చిరునవ్వుల జీవిత కాలం ముప్పై సెకండ్లు మాత్రమే. కొండొకచో పదిహేను సెకండ్లే. ఇలా వచ్చి అలా మాయమవుతుంది. నవ్వకపోతే బాగుండదని నవ్వుతారో, అది వారి సంస్కృతిలో భాగమో తెలుసుకోవటం కొంచెం కష్టమే. వాళ్ళు ఏ నవ్వులు నవ్వి డెభై శాతం ప్రపంచాన్ని ఆక్రమించారోగాని, ఇలాటి క్షణక్షణం నవ్వులతో కాదని నా గట్టి నమ్మకం.

ఆసియా దేశాల్లో, ఇండియాతో సహా, నవ్వటం అంత వ్యాపార లక్షణంగా అనిపించదు. చైనా, తైవాన్, జపాన్, కొరియా మొదలైన దేశాలకు మేము బిజినెస్ సమావేశాల నిమిత్తం వెళ్ళినపుడు, వాళ్ళు నవ్వుతూ పలకరించటం కొంచెం

కాదు, బాగా తక్కువే. జపానులో అయితే వారిలో కొంతమంది మాట్లాడుతుంటే కొట్టి మాట్లాడుతున్నాడో, నొక్కి వక్కాణిస్తున్నాడో తెలియదు. నాబోటి వారికి వాళ్ళ భాష అర్థం కాదు కాబట్టి, అలా అనిపిస్తుందేమో! కాకపోతే రాత్రి పూట మాతో రెష్టారెంట్లో సాకీ త్రాగిన మత్తులో, మనకి అర్థంకాని వాళ్ళ భాషతో ఇంగ్లీష్ కలిపి నవ్వటం చూస్తుంటే మాత్రం సరదాగా వుంటుంది. నాకు జపాన్ వాళ్ళంటే చాల ఇష్టం. ఎంతో క్రమశిక్షణ, మర్యాదా వున్నవాళ్ళు. కొందరు మిత్రులు వాళ్ళ ఇళ్ళకు పిలిచి నాకు ఆతిథ్యం కూడా ఇచ్చారు.

ఆసియా దేశాల్లో ఈమధ్య ప్రపంచీకరణం వల్ల కొంచెం మారారుగానీ, పశ్చిమదేశాల్లోలా కాదు. అక్కడ షాపుల్లో, రెష్టారెంట్లలో, హోటళ్ళలో కూడా దాదాపుగా అంతే. నవ్వులు వడ్డించరు. నాలాటి శాకాహారికి నేను తినను అన్నా వినకుండా వడ్డించేవి జలపుష్పాలే!

మన భారతదేశంలో కూడా ఇంతకుముందుకన్నాకొంత మారినా, వ్యాపారానికే కాదు, నిత్య జీవితంలో కూడా బాగా తెలిసిన వాళ్ళతో తప్ప నవ్వటం తక్కువే.

షాపుల్లోకి వెడితే నవ్వకుండా మర్యాద ఇస్తారేమోగానీ, నవ్వుతూ పలకరించటం తక్కువే. ఏ మార్వాడీ షాపుల్లోనో ఆకాశంలో నక్షత్రాల్లా అప్పుడప్పుడూ ఆ నవ్వులు మిణుక్కుమంటుంటాయి. ఆఁ! నక్షత్రాలు అంటే గుర్తుకి వచ్చింది, ఐదు లేక ఏడు నక్షత్రాల హోటళ్ళలో ఈమధ్య వాళ్ళు మనకి నవ్వులు పువ్వుల్లో పెట్టి ఇస్తున్నారు. మరి డబ్బులు ఎంతో ఎక్కువగా ఇస్తున్నాం కదా, అందుకేనేమో!

ఇక మనం కట్టే టాక్సులతో బ్రతుకుతున్న ప్రభుత్వోద్యోగులు కొందరు, ఉద్యోగం రాగానే ఇంట్లోనే ఇనప్పెట్టెలో నోట్ల కట్టల మధ్య ఆ నవ్వులు భద్రంగా దాచేసి ఆఫీసుకి వస్తారు. ఏ ప్రభుత్వ ఆఫీసుకిగానీ, బాంకుకిగానీ వెళ్ళినప్పుడు, కనీసం ఒక్కసారైనా వాళ్ళకి గిలిగింతలు పెట్టి నవ్విద్దామనిపిస్తుంది. అలాగైనా కష్టమరులని కష్టపెట్టకుండా నవ్వుతూ పలకరిస్తారేమోనని.

మొన్న ఈమధ్య అందరం మా చుట్టాల ఇంట్లో దగ్గరి చుట్టాలతో దూరంగానూ, దూరపు చుట్టాలతో దగ్గరగానూ కూర్చుని పాత ఫొటోలు, అంటే ఆనాటి తెలుపు–నలుపు ఫొటోల దగ్గరనించీ ఈనాటి డిజిటల్ ఫొటోలదాకా చూస్తూ, ఆ జ్ఞాపకాల మైమెరుపులతో నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నాము. కానీ ఆ ఫొటోల్లో అందరూ సీరియస్‌గానే వున్నారుగానీ, ఏ ముఖంలోనూ నవ్వులు లేవు. అదే మా తమ్ముడితో అంటే, 'ఫొటోల్లో నవ్వటం అనేది మన ఇంటా వంటా లేదు' అన్నాడు 'నవ్వుతూనే'! అంతేకాదు ఫొటో తీస్తున్నప్పుడు ఫొటోగ్రాఫర్ ఒకటి, రెండు, మూడు అనగానే అందరూ బిగుసుకుపోవటం కూడా ఒక కారణం అయివుండనోపు!

శరీరానికే కాక, మనసుకి కూడా ఎప్పుడూ నవ్వుతూ వుండటం మంచిది అని ప్రపంచమంతటా చెప్పేదే. అందుకనే హాస్యంగా వుండే కథలు, పాటలూ, సినిమాలు, నాటకాలూ, కామెడీ క్లబ్బులు... ఏవయితేనేం ఎప్పుడూ మనని నవ్విస్తూ, ఆనందపరుస్తూ, మన జీవితంలో వుండే కష్ట నష్టాలను భరించే మానసిక శక్తినిస్తుంటాయి.

అందుకే ‘నవ్వు నాలుగందాల చేటు’ అనే మన సామెతను చెరిపేసి, ఈ క్షణం నించీ ‘నవ్వు నాలుగు విధాల మేలు’ అని మార్చేద్దాం!

నవ్వండి, నవ్వులు పంచండి, నవ్వుతూనే ఉండండి.

*(మరో ముచ్చట వచ్చే నెలలో)*

COMMENTS